అన్నాడు వాడు. "నీకు భయం పోవడానికి మీఅమ్మ చాలదూ?" అని అడిగింది పడుచు అదోజాలిగా. "మనం వెళ్ళేసరికి మా అమ్మ జీవాలు వదిలేసి వుంటుంది" అన్నాడు వాడు కళ్ళు చెమర్చుకుంటూ. "పెద్దపులివల్లనే?" అని ప్రశ్నించింది ఆమె. "కాదు స్వభావంగా ముసిలిదై" అన్నాడు వాడు అతి నిబ్బరంగా! దారిలో వారిద్దర్నీ "మేన్ ఈటర్" ఎదుర్కొంది కాని ఆ పిల్లయొక్క అనాది అడవి వాలకం చూస్తూ శాంతంగా పిల్లిలా తప్పుకుంది.

.... .... .... .... ....

## మోటార్ స్టార్టింగ్

స్వేచ్ఛ ఆ దేశంలో విశ్వరూపం దాలుస్తూవున్న, రోజులవి. మగవాళ్ళ స్వేచ్ఛకోసం మగవాళ్ళ క్లబ్బులు, ఆడవాళ్ళ స్వేచ్ఛకోసం ఆడవాళ్ళ క్లబ్బులు, ఏలా విస్తరిల్లి వున్నాయో ఆలాగ్గానే తమకూ ప్రత్యేకించి క్లబ్బులు వుండాలంటూ తల్లిదండ్రుల్ని సాధించి వేధించి, మోది, మొత్తి, మొఱగించి, కరగించి, చిన్నపిల్లలందరూ కలసి ఆమహా పట్నంలో "చిల్డ్రిన్సు క్లబ్బు" ఒకటి సంస్థాపించుకున్నారు. "చిల్డ్రిన్సు క్లబ్బు" లో మళ్ళీ ఆడ, మగ అనే చీలికల్లేవు. అయితేగియితే ముందు రాబోయే క్రొంగ్రొత్త కృతయుగంలోగానీ చీలిక లవ్వాలి. అప్పటిమట్టుకు ఆ పిల్లకాయలందరూ లింగభేదం పాటించకుండా చెట్టాపట్టా లేసుకుంటూ తమ క్లబ్బును నడిపించుకుంటామన్నారు. ఇప్పటి దాకా నిర్విఘ్నంగా కొనసాగించుకొంటూను వచ్చారు.

అయితే పెద్దవాళ్ళు ఆ చిన్నపిల్లలమీద ఒక నిబంధన మోపారు. అదేమిటంటే సూర్యాస్తమానం అయ్యేటప్పటి కల్లా ఎవరింటికి వారు వచ్చివుండాలని ఆ నిబంధన: ఆ నిబంధన భారం వహించేముందు పిల్లకాయలలో చిన్న కోరిక్కోరారు. ఆ కోరికేమిటంటే, "పెద్దవాళ్ళెవళ్ళూ 'చిల్డ్రిన్స్ క్లబ్బు' యొక్క నాలుగ్గోడల మధ్యమందుగాని, క్లబ్బు మీది అంతరాళ మందుగాని క్లబ్బు క్రింది పాతాళమందుగాని కనిపించరాదని" అదీ వారి చిన్న కోరిక—"దానికేం అభ్యంతరం? మాక్కావల సినదల్లా సూర్యాస్తమానంకాకుండా మీరు రోజూ ఇంటికి తిరిగి వస్తూంటే మీ క్లబ్బు మీ యిష్టం వచ్చినట్టు మీరు నడుపుకోండి" అని ఒప్పుకున్నారు పెద్దలందరూ. అయితే ఒక కన్వెన్షన్, అదే సాంప్రదాయం, గమనించవలసి వుంటుందనుకొన్నారు వీరూ వారూ ఏకమై. అదేమిటంటే—క్లబ్బులో మెంబర్లుగా వుండ వలసిన పిల్లకాయల వయస్సు అయిదేండ్లకూ పదేండ్లకూ మధ్యదేనంట!—

"నవరోజీ" చిన్నపిల్ల. ఆరేళ్ళు వెళ్ళి అరున్నొకటో యేడు వచ్చింది. ముద్దు ముద్దుగా రేడియో పాటలు అనుకరిస్తూ, టాకీ నృత్యాలు "కాపీ" కొడుతూ, కనులు మిటకరించే క్రొత్త అద్దు కాగితం మనస్సు అనుకోండి, ఆ పిల్ల మనస్సు. ఆ పిల్ల తల్లిపేరు "రోజీ" ఆ పిల్ల అమ్మమ్మపేరు "మెరోజీ".

"మెరోజీ" తరం తప్పించి దిగువతరం దగ్గఱకు వస్తిమా అంత ప్రమాదం లేదు. "రోజీ" కి ముప్పైయేళ్ళ కంటె ఎక్కువ వయస్సుండదు. ఇరవై యేళ్ళదాకా పెళ్ళేచేసుకో లేదు ఆ పైని మూడేళ్ళు భర్తతో కాపరం చేసినా సంతానం

కలగలేదు. ఇరవై మూడో యేట నవరోజీ కలిగిందేగాని నవరోజీ పెరిగిందంతా డబ్బాపాలమీదేను. దానా దీనా "రోజీ" నవకం, గమకం నాటికీ నేటికీ చెక్కుచెదరలేదు.

అంతలో, "నవరోజీ" పుట్టిన ఏడాదిలో, రోజీ భర్త కాలం చేశాడు. అప్పట్నించీ, "రోజీ" "మొరోజీ" చాటున, "నవరోజీ" "రోజీ" మాటున, ఒదిగి వొదిగి, ఇల్లు విడిచి పెట్టకుండా పట్నంలోనే కాలక్షేపం చేస్తూవచ్చారు. అసలు వారందరిదీ పట్నమే జన్మస్థానం! అలాంటప్పుడు మరెక్కడకు పోతారు?

అయితే "రోజీ" అందం "నూర్జహాన్ అందంలా పేరు కీర్తులు మోసిన అందం. నూర్జహాన్‌కు వచ్చినట్టే ఆమెకూ వైధవ్యం ఎల్లప్రాయంలోనే వచ్చింది. కాని నూర్జహాన్‌కు మల్లే ఆమె ఏ జహంగీరుకు లొంగిపోకుండా ధైర్యం చిక్కబట్టుకుని, వైధవ్యానికి అనువైన చీరలు కడుతూ రవికలు తొడుగుతూ, ఆ కట్టు మాత్రంగా ఆ బెట్టు మాత్రంగా చూపఱకు తన సౌందర్యం చుబ్బన చూఱగా అందిచ్చేది. మరిన్నీ రోజీ కూడా కూడా నవరోజీ వుంటూవచ్చేది కాబట్టి అమె మాతలాగు కనిపించేది.

ఇప్పుడు "చిల్డ్రెన్సు క్లబ్బు" పెట్టిన తరువాత నవరోజీ సాయంకాలం నాలుగు అరున్నర మధ్య తప్పకుండా ఆ క్లబ్బుకు వెళ్ళిపోవలసివుండేది. ఆ గంటల్లో ఎవరైనా ఇంటికివచ్చినా తానెక్కడికైనా వెళ్ళవలసివచ్చినా రోజీ వొక్కర్తే వొంటరిగా వస్తూ పోతూ వుండవలసిన దయింది. "మొరోజీ" మొరోజే. ఉండి ఎంతో లేకపోయినా అంతే!

పై ప్రకారంగా తల్లీ పిల్లా విడివడ్డంలో "రోజీ" కి ప్రత్యేక ప్రభ వచ్చింది. ఆమె అందాన్ని అనేకమంది ఫిల్మ ప్రొడ్యూసర్లు, ఫిల్మ డైరక్టర్లు కొనేసుకోవాలని, కొరికేసి కోవాలని తహతహ పడ జొచ్చారు. కాని ఒకళ్లకూ ఆమె ఏమాటా యివ్వకుండా ఒఖర్నీ అంటీ ముట్టకుండా అతిమోహ మాటంగా "షూటింగు" అప్పటి తన విద్యుక్త ధర్మం నేరవేరుస్తూ- ఒక మేడకట్టి. మేడముందు నీడచెట్లు నాటి హాల్లో తనూ, కుర్చీలు అలంకరణాల్లావుంటూ పట్నానకంతకూ మహాకాంతి ఒక్క యేడాదిలో తీసుకు రాగలిగింది. ఆమె కాంతితో పాటు ఆమె మోటారుకాంతి! ఆమె ఒక్కొక్కప్పుడు చక్రం త్రిప్పుతూ మోటారు నడుపుతూవున్నప్పటి ఆమె మణికట్ల కాంతి! వ్రేళ్ళ కాంతి! గోళ్ళకాంతి! ఏమని చెప్పను?

ఒక్క యేడాది తిరిగివచ్చిందీ అంటే 'చిల్డ్రిన్సు క్లబ్బు'కు మరో వార్షికోత్సవం జరిపే శుభవాసరం ఆసన్నమైనది అన్న మాట. ఆ వార్షికోత్సవానికి పిల్లకాయలందరూ ఓ పన్నాగంపన్ని ఏలాగన్నా పెద్దవాళ్లు తమకు పెట్టిన నిబంధన ఉల్లంఘించాలని సంకల్పించుకున్నారు. ఆ సంకల్పం నెరవేరేందుకు ఓ చిత్రమైన ఎత్తు ఎత్తారు. ఎత్తేమిటి? ఎదో పెద్దవాళ్ళకు నచ్చజెప్పే పద్ధతి వొకటి కనిపెట్టారు.

నవరోజీ ఆ రోజున ఆరున్నరకు సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. ఒక్క నవరోజీ అన్న మాటేమిటి? చిల్డ్రిన్సు క్లబ్బు తాలూకు పిల్లకాయలెవ్వరూ నాటి సాయంకాలం ఆరున్నరకు వారివారి యిండ్లకు తిరిగిపోలేదు. కాని రోజీ ఆదుర్దాను పట్టి చూస్తే మన హృదయాల్లో "నవరోజీ" పదేపదే చిత్రింప

బడక మానదు. రాత్రి 7½ అయింది, 8½ అయింది, 9½ అయింది. ఇంకా నవరోజీ స్వగృహం చేరుకోలేదు. రోజీ తనపిల్ల విషయమై పడుతూవున్న అవస్థకు అంతులేదు. 'కారు' 'గెరాజి'లో వుంది. కాని 'డ్రైవర్' అప్పటికప్పుడే వెళ్ళిపోయాడు. వాడికి వర్తమా నిద్దామంటే మాఋమనిషి లేదు సరిగదా డ్రైవర్ ఇల్లు నవరోజీ భవనానికి ఆరుమైళ్ళదూరం——

రోజీకి గ్రుడ్లనీరు క్రమ్మేస్తూవుంది. మెరోజీ ఆమెకంటె గడసరి కాబట్టి ప్రక్కింటిమగాడికోసం పరుగెత్తింది. ప్రక్కింటి మగాడు అంటే ప్రక్కింటి మగాడే! వారందరకూ పరిచయస్తుడే. అయితే పనివుంటేనేగాని వాకళ్ళతో పలుకాడని మాటలలుబ్ధు. చెయ్యవలసివస్తే దొర్లిదొర్లి ఇతర్లకొఱకు పాటుపడే స్వభావం కలవాడు. ఆ మగవానిపేరు శోభనాచలం;

మెరోజీ శోభనాచలంగారింటికివెళ్ళి రాత్రి 9½ గంటల వేళ తలుపుతట్టుతూ "శోభనాచలంగారున్నారా అండీ ఇంట్లో?" అంది. ఆ సమయమప్పుడు శోభనాచలం భార్య ఏమూలవుందో— శోభనాచలం తన వీధిగధిలోంచి "లేకేం! ఉన్నాను మీరా? వృద్ధులు ఇంత అపరాత్రి వచ్చారేమిటి?" అన్నాడు. "ఏమీ లేదు. కొంచెం సాయపడాలి! ఈ రాతిరి! ఇప్పుడే మళ్ళీ వచ్చి వేయగలరు: నాతో రాండి: దారిలో చెబుతాను. మన మిక్క డాలసిస్తిమా-మీ రెరుగుదురుగా-రోజీని-మా రోజీ మూర్ఛిల్లడమో మృతిచెందడమో జరిగిపోతుంది. దయచేసి నావెంట తక్షణం రాండి! తలుపు ఇంట్లో పిన్నిగారు వేసికుంటారులేండి! రాండి!" అంది మెరోజీ ముందంజను.

శోభనాచలం "ఒసేవ్! తలుపేసుకో! ఇప్పుడేవస్తా! వీరెవరో వచ్చారు. పనిమీద వెడుతున్నా" అంటూ మెరోజీ వెంట నడవసాగాడు. "ఏమిటి సంగతి?" అని సానుతాప పూర్వకంగా అడుగుతూ-శోభనాచలం భార్య అతని వెనకాతల తలుపు వేయనూలేదు. తలుపు విడిచిపెట్టనూలేదు. ఆమెపేరు భగవంతమ్మ. ఆబిడ ఒక్క సన్నాయిగొక్కుగా "తిండి తిని పోతేం?" అని వీధిగుమ్మంలోకివచ్చి వచ్చిన మనిషి వచ్చినట్టే చతికిలబడి కూరుచుంది.

శోభనాచలాన్నిచూస్తూ రోజీ కళ్లు తుడుచుకుని 'చూడండి! అమ్మాయి నవరోజీ ఇంకా క్లబ్బునుంచి రాలేదండి!' అంది. 'ఏక్లబ్బు?' అన్నాడు. అప్పటి కప్పుడే రోజీ తన భవనానికి బీగంవేసి గారేజి తలుపుతీసి మోటారుకారెక్కి "వాళ్ళ క్లబ్బు నుంచేనండి!" అంది. శోభనాచలం "వాళ్ళ క్లబ్బంటే?" "వాళ్ళ క్లబ్బేనండి. చిల్డ్రిన్సు క్లబ్బు! మీరెరుగరూ!" అంటూ మోటారు కాస్త స్టార్టుచేసి పెట్టమండి. శోభనాచలం ఇనుపగురుజు పెట్టి త్రిప్పుతూ కారుకు అయిందనిపించి వెనక సీటులో కూర్చుంటూ "చిల్డ్రిన్సుక్లబ్బు సాయంకాలం 6½కే కట్టేస్తారుగా?" అన్నాడు. రోజీ "అదేనే చూస్తువున్నదీని" అని తన రిస్టువాచీ కేసి చూచి "ఇప్పుడు చూచారా 9½రాత్రి అయింది. ఇంకా రాలేదు మఱి-మీరు దయచేసి ముందుసీటులో కూర్చోండి. మా అమ్మ వెనకసీటులో కూర్చుంటుంది" అంది. శోభనాచలం "ముసిలావిణ్ణికూడా శ్రమపెట్టడ మెందు" కని అనబోయి-అనక "రాండమ్మా రాండి! మీరు వెనకసీటులో కూర్చోండి. నేనిక్కడ కూర్చుంటాను" అంటూ తాను ముందుసీటులో రోజీ చక్రం తిప్పుతూవుంటే చూస్తూ కూర్చున్నాడు.

కార్ సైలెంటు కారేమో చప్పుడులేకుండా వెడుతూవుంది. అందుచేత కారు నడకలో శోభనాచలం రోజీ అనుకునే మాటలు అందరికూ వినిపించడంలోనూ అర్థం అవడంలోనూ ఆశ్చర్యం ఏమీలేదు.

శోభనాచలం :-మీరు కారు బాగానే నడుపుతున్నారే ?

రోజీ :-స్టీరింగు బాగానే వచ్చిందికాని స్టార్టింగు రాలేదండీ ఎందుచేతనో ?

(కారు జావీధి మలుపు అప్పుడే తిరిగింది)

శోభ :-మంచి స్పీడ్‌లోనూ పోనీగరు !

రోజీ :-పోనిస్తానుగాని ఎదరమనిషిని పోల్చలేనండీ !

శోభ :-నేను కనిపెట్టి చూస్తూ వుంటాను. అమ్మాయి ఎదురౌతుందేమో అనా ?

రోజీ :-ఊఁ-మరేనండి.

శోభ :-ఏమైనా పిల్లకు వస్తువులుపెట్టి పంపించారా ?

రోజీ :-లేదండీ ! రెండు పాయల కన్నె జడవేసి గులాబి పువ్వులో రెండు ఈపాయ నొకటి, ఆపాయ నొకటి గ్రుచ్చి ముద్దిచ్చి పంపించాను-నా బంగారు తల్లిని ! (అంటూ కళ్ళ నీళ్ళు కారుస్తూ చుక్కాని చక్రంమీధి కొరిగింది)

శోభ :-ఆభరణాల్లేకపోతే ప్రమాదం వుండదులేండి. ఎందుచేతను ఆలస్యమైందో ? ఈవేళ వాళ్ళ క్లబ్బులో స్పెషల్ ప్రోగ్రామ్ వుండవచ్చును.

రోజీ :-(చక్రంమీది కొరిగినదల్లా ఎడంప్రక్కకు తిరిగి) ఉంటే ఆలస్య మవుతుందని చెప్పవచ్చు చూడండీ ! దాని జడలు రెండూ రెండు కోడెతాచులూ, రెండు నల్లతాచులూను ?

శోభ :-(రోజీ జుత్తుకేసి చూస్తూ) అవే కాపాడతాయి పిల్లను !

(కారు మరోవీధి మలుపు తిరిగింది)

రోజీ :-మీరు పోపురాసిన రేప్ ఆఫ్ ది లాక్ చదివే వుంటారు ! శిరోజాలకు మాత్రం క్షేమం వుందంటారా ?

శోభ :-ఆ రోజులుకీ ఈ రోజులుకీ చాలా వ్యత్యాసం వుంది. ఇప్పు డెక్కడాచూచినా దేనికి తీసినా ఇన్సూరెన్సు, ఎన్యూరెన్సు ! మీ రెరుగరు కామోసు.

రోజీ :-ఎరక్కేమండి ! నాకీర్తి చెప్పన్న లక్షలకు భీమా చేశాను. అయితేనేం నా రతనాల మకుటం ! నా నవరోజీ పెట్టు కొన్న రోజాపుష్పాలమాట ? అవి వాడిపోయి రోడ్డుమీద పడి పోయి ఏమైపోయివుంటాయో ఈపాటికి ! ఎప్పుడూ ఇంతసే పుంటుంది అని అనుకోలేదండీ నేను. వాళ్ళ నిబంధనకూడా సూర్యాస్తమానానికి ముందే ఇంటికి తిరిగివచ్చేయ్యాలనేనండీ ! పొద్దుకూకు ఆరున్నరకొచ్చి బువ్వతిని పక్కమీద పడుకుంటూంటే దాని నెరులనుంచి ఒక్కొక్క గులాబిరేకే విడివడి పక్కదుప్పటీ పైని రాలిపడుతూవుండే అందం ఆనందం ఆ రేకులు రోడ్డుమీది వాళ్ళ పాదాలక్రింద రాత్రి 9½ గంటల చీకు చీకటిలోపడి నలిగి పోతే వుంటుందంటారా నాకు ! ఉండదు ముమ్మాటికీ వుండదు. (అంటూ బ్రేక్‌వేసి చక్రం త్రిప్పడం ఆపి వెక్కు వెక్కు ఏడ్చింది)

శోభనాచలానికి ఏమనడానికి నోటమాట రాలేదు సరికదా కారెక్కడాగింది అనలేదు.

ఆదాకా నిదరమత్తున వెనకసీటులో నిశ్శబ్దంగావున్న మోరోజీ " శోభనాచలంగారూ! ఇదేలాగుందండీ నవరోజీక్లబ్బు "

అంది. శోభనాచలం క్లబ్బుగేటుకేసి చూస్తూ గేటుకీ ప్రక్కా అప్రక్కానున్న రంగులవెలుగు అక్షరాలు గమనిస్తూ "ఇదేనండి క్లబ్బు. కాని లోపలకు పెద్దవాళ్ళకు ప్రవేశంలేదు-"ప్రవేశంలేదు పెద్దలకు!" అని అక్షరాలు మెఱిసిపోతూ అటకాయిస్తున్నాయి. మనం లోపలకు వెళ్లరాదనుకుంటాను" అన్నాడు. రోజీ "మనం లోపలకెందుకు! ఇంకా లోపలేదో కార్యక్రమం జరుగుతూ వున్నట్టుంది. అంతా పట్టపగల్లా లోపల కాంతి కనబడ్డంలే? ఇక్కడ వుందాం! ఇక్కడవుంటే ఈ గేటుదగ్గఱ దొరుకుతుంది నా చిట్టి! అదిగో! అదిగో! వచ్చేస్తున్నాది! వాళ్ళల్లోవుంది-" అంటూ ఓ గుంపుగా ఇవలకు వస్తూవున్న పిల్లకాయల్లోనుంచి గేటువద్ద రోజీ నవరోజీని కేటాయిస్తూ-"ఎంతపనిచేశావే నాచిట్టి తల్లీ! ఎంత ఆలస్యం చేశావే?" అంటూ ఎత్తుకు ముద్దులాడింది ఓతడవ.

నవరోజీలో ఆ అశాంతిలేదు. ఆలస్యమైనదన్న ఆరాటమూ లేదు. "కారేసుకొచ్చారా నాకోసం? ఎందుకూ? నేరాలేనుటే?" అంటూ శోభనాచలానికి రోజీకి మధ్యను కూర్చుంది. మొరోజీ యధాప్రకారంగా తన యధాస్థానం ఆక్రమించుకుంది.

రోజీ:-"దయచేసి కారుకు కొంచెం స్టార్టు ఇవ్వండి! శోభనాచలంగారూ!" అంది. శోభనాచలం "మఱచి పోయాను" అని ముందుకు దిగి కారుకు సాగుడిచ్చి తిరిగి మెక్కి కూర్చున్నాడు.

నవరోజీ ఏదో కొత్తదారిచూస్తూ "ఇలా ఎక్కడికే నడుపుతున్నావు అమ్మా కారు?" అని అడిగింది. రోజీ "లేదుతల్లీ! శోభనాచలంగార్ని వారింటివద్ద దించి మళ్ళీ మనం మనయింటికి

వెళ్ళడం భావ్యం!" అంది. శోభనాచలం ఎందుకు తానక్కణ్ణుంచే దిగి వెళ్ళగల నన్నాడు గాని "మా నవరోజీ కబుర్లు వినవచ్చుగాదండీ" అని రోజీ హెచ్చరించి వుంచేసింది కార్లో.

కారు నడుస్తూవుంది ఏదో కొత్తరస్తాను. నవరోజీ చెబుతూ వుంది "చూశావు అమ్మా! 6కి కింటికి తిరిగిపోవాలనే అడ్డంకి ఈ వేళతో వదలిపోయిందే మాకు! 6కి కు సరిగ్గా నేటి సాయంకాలం మేమంతా ఒక నాటకం వెయ్యడం మొదలు పెట్టాం. దాని పేరు "పట్టపగలు" అని పేరు పెట్టుకున్నాం. ఆ నాటకం ఆడుతూన్నంతసేపూ సూర్యుణ్ణి అతికట్టే అంత ఫ్లడ్‌లైట్—వెలుగు వెల్లువ—ఫోకస్ చేశాం—అంటే కేంద్రీకరించాం! అవరణ అంతా పట్టపగలై వూరుకుంది దాంతో! మఱి సూర్యాస్తమానం కాలేదు అసలీ రోజున మేం క్లబ్బువిడిచి ఇవలకు వచ్చేదాకా! కనిపెట్టావో లేదో నీవు?" అంది నవరోజీ.

అలా నవరోజీ అంటూనే వుంది. ఆ అమాయకపు సుద్దులు వింటూనే వుంది రోజీ! శోభనాచలం ఇల్లు ఇట్టే వచ్చేసింది. శోభనాచలం దుడుంగున ముందడుగున కారుదిగుతూ "సెలవు" అన్నాడు—అంటూ — ఇంట్లోకి తిన్నగా చొరబడి వెళ్ళిపోతున్నాడు. "ఏమండో శోభనాచలంగారూ! దయచేసి కారుకు కొంచెం స్టార్టు ఇచ్చి మఱీ వెళ్ళండి!" అంది రోజీ నవ్వుతూ!

లోపలకు వెళ్ళిన శోభనాచలం తిరిగి వీధిలోకి వస్తూ "క్షమించండి మఱచిపోయాను!" అంటూ కారు ముందు నిలబడే సమయానకు భగవంతమ్మ గుమ్మంలో కూర్చున్నదల్లా కారు ఎదర కురికి "నేనిస్తానులేండి కారుకు స్టార్టు! మీరు వెళ్ళి కాళ్లు కడుక్కోండి!" అంటూ హేండిల్ రోజీ చేతిలోంచి అంది

పుచ్చుకుని "దొడబిడగా దూర్చి" లడలొడగా త్రిప్పి గంయి మనిపించింది కార్నూ గీర్నూ!

శోభనాచలం నిర్ఘాంతపోతూ చూస్తూ, కారును వెళ్ళనిచ్చి, భార్యా భగవంతమ్మతో "ఎప్పుడు నేర్చుకున్నావే ఈ విద్య నీవు?" అన్నాడు. భగవంతమ్మ "వెధవది! అదీ ఓవిద్దేటండీ? మీ యినప్పెట్టి తాళాలు రోజూ ముప్పయిసార్లు వేసి తీసేదాన్ని నాకు నా జబ్బల సత్తువ తెలియదటండీ!" అంది సగర్వ నిగర్వంగా.

.... .... .... .... ....

## సంగీత పరీక్ష

శ్రీనివాసరావు ఇంజనీరు (బి.యి) పరీక్షలో కృతార్థుడై తేనే గాని పెళ్ళి చేసికోనని బింకం పట్టుక్కూర్చొన్నాడు చాలాకాలం. కాని ఈ బింకం వట్టిబింకమేనని చాలామందికి తెలుసు. ఆ కారణం వల్ల పెళ్ళికి ఆడపిల్లలున్న వాళ్ళందరూ ఎప్పుడో వొకప్పుడు శ్రీనివాసరావుని ఆహ్వానం చేసి తమ అభిప్రాయం వెల్లడి చేస్తూ వచ్చారు. విఫలులూ అయ్యారు. క్రమంగా శ్రీనివాసరావు ఊహలు వర్ణనాతీతాలు అయిపోయి, కోరికలు గొంతెమ్మ కోరికలు అయినయ్. మరెవ్వరూ అతణ్ణి పిల్చి పిల్లనిస్తాం అనే వాళ్ళు లేకపోయారు. శ్రీనివాసరావు చదువు పూర్తి అయినప్ప ట్నుంచి అస్తమానం సంగీత పరిశ్రమ చేసేవాడు. ఎక్కడన్నా జలపాతం చూచాడో అందలి విద్యుత్ప్రభావం ఎంత తెలిసికో